65 ఏళ్ల అనంతరం...

రేపటి నుంచి అందుబాటులోకి
విక్టోరియా హాలు

● ప్రారంభించనున్న ముఖ్యమంత్రి స్టాలిన్


విద్యుత్ దీపాల వెలుగుల్లో

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ పక్కనే వున్న విక్టోరియా హాలును ఈ నెల 20న ముఖ్యమంత్రి స్టాలిన్ పునఃప్రారంభించనున్నారు. పాత కొత్త కలగలసిన భవనాల వారసత్వ చిహ్నం చెన్నై నగరం. అక్కడక్కడా ఎత్తయిన భవనాలున్నప్పటికీ, బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనాలు నేటికీ గంభీరంగా దర్శనమిస్తున్నాయి. అటువంటి భవనాల్లో చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ భవనం-గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ భవనం మధ్యలో ఎరుపు రంగులో దర్శనమిచ్చే విక్టోరియా హాలు ఒకటి. 65 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనం గురించి నేటి తరానికి తెలియదు. 1887లో రాణి విక్టోరియా స్వర్ణోత్సవాలకు గుర్తుగా విక్టోరియా పబ్లిక్ హాలు నిర్మించారు. ఈ భవనాన్ని ఇండో-సార్సెనిక్ శైలిలో ఆర్ఎఫ్ సింషామ్ రూపొందించగా, భవనాన్ని టి.నంబెరుమాళ్ చెట్టియార్ నిర్మించారు. ఆ సమయంలో, కార్పొరేషన్ నుంచి 99 ఏళ్లకు లీజుకు తీసుకుని 3.14 ఎకరాల్లో రూ.2.27 లక్షలతో విక్టోరియా పబ్లిక్ హాలు నిర్మించారు. ఈ భవనం పొడవు 48 మీటర్లు, వెడల్పు 24 మీటర్లు, ఎత్తు 19 మీటర్లు, టవర్ ఎత్తు 24 మీటర్లుగా నిర్మించారు. ఈ భవనానికి చాలా చరిత్ర ఉంది. 1897లో స్వామి వివేకానంద విక్టోరియా హాలులో ఉపన్యాసం చేశారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, గోపాలకృష్ణ గోఖలే వంటి నాయకులు ప్రసంగిచారు. ఇవి మాత్రమే కాదు, విద్యుత్, గ్యాస్ లైటింగ్ ప్రవేశపెట్టింది ఈ హాలులోనే కావడం మరో విశేషం. 1985లో తొలిసారి సినిమా ప్రదర్శించారు. ఎన్నో నాటకాలు కూడా ఇక్కడే ప్రదర్శించబడ్డాయి. అన్నా-ఎంజీఆర్ మొదటిసారిగా కలిసిన ప్రదేశం ఇది. వివిధ చారిత్రక సంఘటలను చిహ్నంగా నిలిచిన విక్టోరియా పబ్లిక్ హాలు 1960 తర్వాత దాని ప్రాముఖ్యత కోల్పోవడం ప్రారంభమైంది. అందుకు కారణం, చాలా పెద్ద హాళ్లు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడగా, భవనం కూడా శిధిలం కావడం ప్రారంభమైంది. 1986లో లీజు ఒప్పందం ముగియడంతో, ఆ స్థలం స్వాధీనం చేసుకోవాలని కార్పొరేషన్ నిర్ణయించింది. కానీ, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉండంతో విక్టోరియా పబ్లిక్ హాలు స్వాధీనం చేసుకొనేందుకు వీలుకాలేదు. అనంతరం ఈ వ్యవహారం కోర్టుకు వెళ్లడంతో, భవనం శిథిలావస్థకు చేరి, పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ క్రమంలో, 2009వ సంవత్సరం కోర్టులో కేసు విచారణ ముగిసి, విక్టోరియా పబ్లిక్ హాలు కార్పొరేషన్‌కు సొంతమైంది. అప్పుడే, ఈ భవనం ప్రాచీనత దెబ్బ తినకుండా పునరుద్ధరించాలని నిర్ణయించారు. కానీ, వివిధ కారణాలతో జాప్యం జరిగింది. ఈ క్రమంలో, గత ఏడాదిలో మార్చిలో 'సింగార చెన్నై' ప్రాజెక్ట్ కింద రూ.32.62 కోట్లతో విక్టోరియా పబ్లిక్ హాలు పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. దిగువ అంతస్తులో 600 మంది, పై అంతస్తులో 600 మంది, బాల్కనీలో 200 మంది మొత్తం 1,400 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన విక్టోరియా పబ్లిక్ హాలు పునరుద్ధరణ పనులు ఇటీవల ముగిశాయి. ఈ భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఆ ప్రకారం, 65 ఏళ్ల అనంతరం మళ్లీ ప్రజల వినియోగానికి విక్టోరియా పబ్లిక్ హాలు అందుబాటులోకి రానుంది. ఈ హాలు అద్దెకు తీసుకుని కళ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వినియోగించవచ్చు.


పునరుద్ధరించిన విక్టోరియా హాలు

దశాబ్ద కాలం తరువాత...

ఆదికుంభేశ్వరాలయంలో
వినిపించనున్న రాతి నాదస్వరం

28న కుంభాభిషేక వేడుకల్లో వాయించనున్న కళాకారులు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం ఆదికుంభేశ్వరాలయ కుంభాభిషేక వేడుకల్లో భాగంగా రాతి నాదస్వరం వినిపించనుంది. పలు దశాబ్దాల తర్వాత ఆ ఆలయంలో భద్రపరచిన రాతి నాదస్వరం భక్తులకు శ్రవణానందం కలిగించనుంది. తంజావూరు చక్రవర్తి రాజరాజచోళుడి పరిపాలనలో కుంభకోణం నగరం ఆలయాల నగరంగా పేరు ప్రఖ్యాతులు పొందింది. ఆ నగరంలోని మహామఖ తీర్థవారి మొట్టమొదటి క్షేత్రమైన ఆది కుంభేశ్వరాలయంలో చరిత్రకు సాక్ష్యంగా రాతి నాదస్వరాన్ని భద్రపరచి శతాబ్దాలుగా దానిని కాపాడుతున్నారు. ఈ ఆలయంలో రెండు రాతి నాదస్వరాలు లభ్యమయ్యాయి. ఒకటి ఆలయంలోను మరొకటి చెన్నై మ్యూజియంలో ఉన్నాయి. కొయ్యతో చేసిన నాదస్వరం బరువు 600 గ్రాములైతే ఈ రాతి నాదస్వరం బరువు ఆరింతలు అధికం. అంటే రాతి నాదస్వరం బరువు 3.6 కిలోలు. సుమారు రెండడుగుల పొడవున్న ఈ రాతి నాదస్వరం ఉత్తరాది కళాకారులు ఉపయోగించే షెహనాయ్‌లా ఉంటుంది. ప్రపంచంలోనే మొట్టమొదటి సంగీత పరికరంగా భావించే నాదస్వరం కొయ్య తో తయారు చేస్తారు. అయితే ఈ రాతి నాదస్వరాన్ని వాయించడం అంత సులువు కాదు. కొయ్యతో తయారైన నాదస్వరంలో సప్తస్వరాలకు ఏడు రంధ్రాలుంటాయి. అయితే ఈ రాతి నాదస్వరంలో ఆరు రంధ్రాలు మాత్రమే ఉంటా యి. అందుకే దీనిని 'తిమిరి' రకం నాదస్వరంగా చెబుతారు. ఈ కారణంగా ఈ రాతి నాదస్వరంతో షణ్ముఖప్రియ, కళ్యాణి వంటి ప్రతిమధ్యమ రాగాల్లోనే వాయించగలుగుతారు. శంకరాభరణం, హరహరప్రియ, తోడి వంటి శుద్ధమధ్యమ రాగాలను రాతి నాదస్వరంలో వాయించలేరు. సాధారణ నాదస్వరం కంటే ఈ రాతి నాదస్వరం వాయించడానికి శ్వాసను బాగా పీల్చి వదిలితేనే మంచి సంగీతం వస్తుంది.. కనుక ఈ రాతి నాదస్వరాన్ని వాయించడానికి సునిశిత శిక్షణ అవసరమని ఆ ఆలయం మాజీ నాదస్వర విద్వాంసులు స్వామినాథన్ తెలిపారు. దివంగత నాదస్వర దిగ్గజం మన్నార్గుడి బక్రియా పిళ్లై 60 యేళ్ల క్రితం ఆదికుంభేశ్వరాలయంలో జరిగే ముఖ్యమైన ఉత్సవాల్లో ఈ రాతి నాదస్వరాన్ని వాయించేవారని, ఆ తర్వాత నాదస్వర విద్వాంసుడు కుంజితపాదం పిళ్లై 30 యేళ్లపాటు ఈ రాతి నాదస్వరాన్ని వాయించారని తెలిపారు. ప్రస్తుతం ఈ రాతి నాదస్వరాన్ని ఆలయ కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకుని తన కుమారుడు తమిళరసన్, ఆలయ నాదస్వర కళాకారుడితో కలిసి తాను కూడా వాయించనున్నట్లు వివరించారు. సుమారు దశాబ్దం క్రితం ఈ రాతి నాదస్వరాన్ని దసరా వేడుకల సందర్భంగా వాయించినట్లు తెలిపారు. ఆ తరువాత ఈ నెల 28న ముగ్గురూ కలిసి రాతి నాదస్వరాన్ని వాయించనున్నట్లు స్వామినాధన్ తెలిపారు.


ఆలయంలో ఉన్న రాతి నాదస్వరం.


వాద్య కళాకారుడు స్వామినాథన్

నేడు కోయంబత్తూరులో

సేంద్రియ వ్యవసాయ సదస్సు

● హాజరుకానున్న ప్రధాని మోదీ ● భారీ భద్రతా ఏర్పాట్లు



చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం వాణిజ్యనగరమైన కోయంబత్తూరు రానున్నారు. ఇందుకోసం పోలీసు ఉన్నతాధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను, విధానాలను రూపొందించేలా ప్రత్యేక రైతు సదస్సు కోవైలోని కొడీసియా మైదానంలో బుధవారం మధ్యాహ్నం జరుగనుంది. ఆ సదస్సులో పాల్గొనే నిమిత్తం ప్రధాని మోదీ మధ్యాహ్నం 1.30 గంటలకు విమానంలో కోయంబత్తూరు రానున్నారు. ఆ తర్వాత విమానాశ్రయం నుంచి ఆయన కారులో కొడీసియా మైదానానికి చేరుకుంటారు. సదస్సు ప్రారంభించి సేంద్రియ వ్యవసాయంలో అధిక ఉత్పత్తి సాధించిన రైతులను ఘనంగా సత్కరించనున్నారు. అదే సమయంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తరఫున హాజరైన సేంద్రియ వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో చర్చించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రధాని మోదీ మధ్యాహ్నం 3.15 గంటలకు కారులో బయలుదేరి కోయంబత్తూరు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళతారు. మోదీ పర్యటన సందర్భంగా కోయంబత్తూర నగరమంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో ఐదంచెల భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు ఆ నగర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. కోయంబత్తూరు నగరంలో మంగళవారం ఉదయం నుండి బుధవారం రాత్రి 7 గంటల వరకు డ్రోన్లపై నిషేధం విధించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

కోవైలో అన్నీ గెలవాల్సిందే

● పార్టీ ఇన్‌చార్జులకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ దిశానిర్దేశం

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కోయంబత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులే గెలవాలని, ఆ దిశగా నియోజకవర్గాల ఇన్‌చార్జులు గట్టిగా ప్రయత్నించాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని స్టాలిన్ జూలై నుంచి 'ఉడన్ పిరప్పే వా' పేరుతో నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయన 80 నియోజక వర్గాల నేతలతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో కోయంబత్తూరు జిల్లాలోని సూలూరు, కినత్తుకడవు, వాల్పారై నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో వరుసగా సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో డీఎంకే లేదా దాని మిత్రపక్షాల్లో ఏ పార్టీ అభ్యర్థిని నిలబెడితే సులువుగా గెలుస్తారో సూచించాలని, డీఎంకే తరఫున పోటీ చేయడానికి అంగబలం, ఆర్థిక బలం కలిగిన అభ్యర్థులుంటే తమకు ప్రతిపాదనలు పంపాలని స్టాలిన్ కోరారు. అదే సమయంలో కోయంబత్తూరు జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ జిల్లా అంతటా అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థుల విజయానికి ప్రణాళికలు, వ్యూహరచన రూపొందించుకుని ఇంటింటి ప్రచారానికి వెళ్లాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో ఆ జిల్లాలో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులెవరూ గెలువకుండా చూడాలని స్టాలిన్ కోరారు.


స్టాలిన్‌తో భేటీ అయిన కోవై జిల్లా ఇన్‌చార్జి

ప్రధాని మోదీకి సీఎం లేఖ

రాష్ట్రంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వరిలో తేమశాతాన్ని 17 నుండి 22 శాతంగా పెంచాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా ధాన్యం దిగుబడి వచ్చిందని, ప్రస్తుతం వర్షాల వల్ల ప్రభుత్వ గోదాముల్లో ఉన్న వరిలో తేమ శాతం పెరుగుతూనే ఉంటుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని 22 శాతం తేమ కలిగిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

ఏర్కాడును కప్పేసిన మంచుదుప్పటి

చలికి వణుకుతున్న పర్యాటకులు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరొందిన పర్యాటక ప్రాంతం ఏర్కాడులో మంగళవారం వేకువజాము దట్టమైన మంచు ఆవరించింది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంచుకు తోడుగా చలి కూడా పెరగటంతో స్థానికులు వణికిపోతున్నారు. మూడు రోజులు ఏర్కాడు అంతటా మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం బాగా చల్లబడింది. సోమవారం సాయంత్రం వాన జల్లులు పడగానే దట్టమైన మంచు ఏర్కాడు అంతటా వ్యాపించింది. మంగళవారం వేకువజాము 5.30 గంటలకు రోడ్డు కూడా కనబడనంతగా మంచు వర్షం కురిసింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహన చోదకులు తమ వాహనాల హెడ్‌లైట్లను వేసుకుని వాటిని నడపాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ఏర్కాడులో మంచు అధికమై చలి కూడా పెరగటంతో స్థానికులు, పర్యాటకులు స్వెట్టర్ల కొనుగోలుపై దృష్టిసారిస్తున్నారు. రహదారుల పక్కనే చౌక ధరలకు అమ్ముతున్న స్వెట్టర్లు, మఫ్లర్లను కొనేందుకు బారులు తీరారు. మరో వారం రోజులపాటు ఏర్కాడు అంతా తరచూ మంచు వర్షం కురుస్తుందని, తేలికపాటి వాన జల్లులు కూడా పడతాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.



బంగాళాఖాతంలో

మరో అల్పపీడనం

8 జిల్లాలకు భారీ వర్ష సూచన

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడటంతో రాష్ట్రంలో 8 జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరిక చేసింది. నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరం గా ఉంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ, వాయువ్య దిశగా ప్రయాణించే సూచనలున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతంలో పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రాజధాని చెన్నై నగరంలో మంగళవారం మోస్తరుపాటి వర్షపు జల్లులు పడుతున్నాయి. మంగళవారం భారీ వర్షం కారణంగా విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరి - కారైక్కాల్ ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించిన విషయం తెల్సిందే. ఇదిలావుంటే, ఈ నెల 22వ తేదీ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా జాక్టో-జియో సమ్మె

● బోసిపోయిన కార్యాలయాలు, పాఠశాలలు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ కమిటీ (జాక్టో- జియో) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేయడంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు బోసిపోయాయి. తమ కోర్కెల పరిష్కారం కోసం జాక్టో-జియోకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొంత కాలంగా వివిధ రకాలుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుచ్చిలో జరిగిన ఆ కమిటీ సమావేశంలో నవంబరు 18న లాంఛన ప్రాయ సమ్మె జరపాలని నిర్ణయించారు. ఆ ప్రకారమే మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, 2003 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు పాత పింఛన్ పథకాన్ని వర్తింపజేయాలని సహా మొత్తం 10 డిమాండ్లను ఆమోదించాలని సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె కారణంగా సచివాలయం, ఎళిలగమ్, కురళగమ్, వాణిజ్య పన్నుల కార్యాలయం, సైదాపేట పనగల్ మాళిగై, కలెక్టర్ కార్యాలయంలో తక్కువ సంఖ్యలో ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఇదేవిధంగా ఉపాధ్యాయులు కూడా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఎళిలగమ్ వద్ద కమిటీ సమన్వయకర్తలు వెంకటేశన్, సురేష్, గాంధి రాజన్ నాయకత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు గుమికూడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరంతా సచివాలయ ముట్టడికి సిద్ధమవుతున్నారని తెలుసుకుని చేపాక్ ప్రభుత్వ కార్యాలయం నుండి మెరీనా కామరాజర్ రోడ్డు ప్రవేశ ద్వారం వరకు పోలీసులను మొహరించారు. ఈ సమ్మెలో రాష్ట్రమంతటా సుమారు 6 లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నట్లు కమిటీ నిర్వాహకులు ప్రకటించారు. ఇకనైనా తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం ఆమోదించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కమిటీ నాయకులు హెచ్చరించారు.


ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయం



చేపాక్ ఎళిలగమ్ వద్ద నిరసన ర్యాలీ చేస్తున్న జాక్టో- జియో సంఘాల సభ్యులు

సమాచార దృష్టి

డాక్యుమెంటరీ పరిశోధనలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరుదైన పత్రాల అధ్యయనానికి పోస్టు గ్రాడ్యుయేట్లు, పరిశోధకులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి.చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర చరిత్రను వెలికితీసేలా పరిశోధన ప్రాజెక్ట్ ప్రారంభించామన్నారు. మ్యూజియం, ఇతర ప్రాంతాల్లోని అరుదైన పత్రాలను అధ్యయనం చేసేందుకు పోస్టు గ్రాడ్యుయేట్లు, వ్యక్తిగత పరిశోధకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక సంవత్సరం వరకు నెలకు రూ.50,000 పరిశోధన గ్రాండ్‌తో అరుదైన పత్రాలు అధ్యయనం చేసేందుకు ఆసక్తి ఉన్న వారు https://tamilanaduarchives.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని మంత్రి చెళియన్ తెలిపారు.

భారత వైద్యకోర్సుల్లో 418 సీట్లు ఖాళీ

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత వైద్య, హోమియోపతి కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 418 సీట్లు ఖాళీ ఉన్నాయి. భారత వైద్య, హోమియోపతి శాఖ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఐదు ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేటు కళాశాలలున్నాయి. వీటిలో, సిద్ధ, యునానీ, ఆయుర్వేదం, హోమియోపతి, యోగా, ప్రకృతి వైద్యం తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి మూడో విడత కౌన్సెలింగ్ ఇటీవల ముగిసింది. ఆ ప్రకారం, మేనేజ్‌మెంట్ కోటాలో ఆయుర్వేదంలో 31 సీట్లు, సిద్ధలో 90, హోమియోపతిలో 90 సీట్లున్నాయి. అలాగే, యోగా, ప్రకృతి వైద్యం కోర్సుల్లో 200 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నట్లు భారత వైద్యం విద్యార్థుల ఎంపిక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.301 కోట్లతో 'స్పోర్ట్స్ సిటీ'

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో సెమ్మంజేరిలో కొత్త స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నగరంలో జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ హాకీ, క్రికెట్ తదితర క్రీడల నిర్వహణకు ప్రత్యేక మైదానాలున్నాయి. కానీ, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహణకు, శిక్షణకు అవసరమైన క్రీడా నగరాలు లేవు. ఈ నేపథ్యంలో, ఓఎంఆర్ సెమ్మంజేరిలో ఆక్రమణలో ఉన్న 112 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెండేళ్ల క్రితం స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం, 112 ఎకరాలను కొద్ది నెలల క్రితం రెవెన్యూ శాఖ నుంచి యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖకు మార్చారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీకి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందులో, క్రీడాభివృద్ధి కమిషన్ తరఫున, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.301 కోట్లతో ఫుట్‌బాల్ స్టేడియం. రోలర్ స్కేటింగ్ రింక్, షూటింగ్ రేంజ్, ఆర్చరీ రేంజ్, అథ్లెటిక్స్ స్టేడియం తదితరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటుచేయనున్నట్లు జీవోలో ప్రభుత్వం తెలియజేసింది.

నవోదయ పాఠశాలల్లో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నవోదయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి కలిగిన వారు kvsangathan.nic.in, cbse.nic.in అనే వెబ్‌సైట్లలో డిసెంబరు 4వ తేదిలోగా దరఖాస్తు సమర్పించాలి. ప్రస్తుత సంవత్సరం 57 కేంద్రీయ విద్యాలయ పాఠశాలల ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం కొత్తగా ప్రారంభం కానున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు, బోధనేతర పోస్టుల భర్తీకి ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష జనవరిలో, ఫిబ్రవరిలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. హాల్ టిక్కెట్లు డిసెంబరులో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తిరుమలనాయక్ ప్యాలెస్ దర్శనం ఉచితం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'వరల్డ్ హెరిటేజ్ వీక్ 2025' సందర్భంగా తిరుమలనాయక్ ప్యాలెస్‌ను ఉచితంగా వీక్షించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర చరిత్రలో తనదైన ముద్రవేసిన మదురై పాలకులు తిరుమలనాయక్ క్రీ.శ 1636లో నిర్మించిన ఈ రాజ భవనం, నాయక్ పాలనలోని నిర్మాణ కళకు నిదర్శనంగా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ క్రమంలో, వారసత్వ భవనాలు, వారసత్వ కళా సంపదను కాపాడుకొనేలా ప్రతి ఏడాది నవంబరు 19 నుంచి 25వ తేది వరకు ప్రపంచ వారసత్వ వారోత్సవాలు జరుపుతున్నారు. పురాతన గ్రామ పరిపాలన, న్యాయం, ఎన్నికల వ్యవస్థ, వ్యవసాయం, నీటిపారుదల వ్యవస్థ, నీటి సంరక్షణ, పన్నులు, ఆలయ పరిపాలన తదితరాలను ప్రస్తుతం లభిస్తున్న ప్రాచీన శాసనాల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ప్రకారం, మదురై తిరుమలనాయక్ ప్యాలెస్‌ను బుధవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చని సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

'కబీర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక, కుల సామరస్యం కోసం శ్రమిస్తున్న వారిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం 'కబీర్' పురస్కారం అందజేస్తోంది. రాష్ట్రంలో నివసించే భారతీయ పౌరులు (సాయుధ దళాల సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు మినహా) ఈ అవార్డుకు అర్హులు. మత అల్లర్ల సమయంలో, హింసను ఎదుర్కొని ఇతరుల ప్రాణాలు, ఆస్తులు కాపాడిన వారికి కుల, జాతి, తరగతి ఇలా మూడు విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతలకు రూ.20,000, రూ.10,000, రూ.,5,000 చెక్కు, ప్రశంసాపత్రం అందజేస్తారు. రిపబ్లిక్ డే రోజున ముఖ్యమంత్రి ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. 2026వ సంవత్సరానికి ఈ పురస్కారం పొందేందుకు అర్హులైన వారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 15వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కూటమి ఐక్యతే మా బలం: మంత్రి అన్బిల్ మహేష్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా కూటమిలోనే ఉన్నామని, తమ బలం కూటమి ఐక్యత అని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ వ్యాఖ్యానించారు. 2025వ సంవత్సరానికి జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్ పోటీలను తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ నిర్వహించనుంది. ఈ పోటీల సన్నాహక సమావేశం మంగళవారం తంజావూరు క్రీడా మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అన్బిల్ మహేష్ మీడియాతో మాట్లాడుతూ... సాధారణంగా వర్షాకాలం అంటేనే కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల ప్రాంగణాల్లో వర్షపు నీరు నిల్వ ఉండరాదు, పాఠశాల ప్రాంగణాల్లోని బావులను సత్వరం మూసివేయాలి, విద్యుత్ లీకేజీ లేకుండా చర్యలు తదితరాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం అన్ని పార్టీలు కూటమిని ఆదరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా తమ కూటమి ఉందని, మా బలమే కూటమి పార్టీల ఐక్యత అన్నారు. ఒక్కొక్కరిని ఒక్కో సిద్ధాంతం ఉంటుందన్నారు. కానీ, కూటమి ఒప్పందం ప్రకారం, అందరూ తమ తమ విభేదాలు పక్కనబట్టి ఐక్యతగా, స్నేహంగా ఉంటామని, ఇదే కూటమి విజయ రహస్యమని మంత్రి తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ విజయ్‌తో మాట్లాడారు కదా అనే ప్రశ్నకు, అందుకు సమాధానం వారినే అడగాలని మంత్రి బదులిచ్చారు.

అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు

పదిమంది అధికారులపై సస్పెన్షన్‌కు చర్యలు?

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు చట్టవిరుద్ధంగా గుర్తింపు ఇచ్చిన వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదుచేసిన నేపథ్యంలో, అన్నా విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ సహా పది మంది అధికారులను త్వరలో సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం. అన్నా విశ్వవిద్యాలయం గుర్తింపు పొంది, రాష్ట్రంలో 470కి పైగా ప్రైవేటు, స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు అక్రమంగా అఫిలియేషన్ అనుమతి మంజూరు చేసినందుకు అన్నా విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ జె.ప్రకాష్, అఫిలియేషన్ అప్రూవల్ యూనిట్ డిప్యూటీ డైరెక్టర్ ఇళయపెరుమాళ్ సహా 10 మందిపై ఏసీబీ కేసు నమోదుచేసింది. సాధారణంగా, రిజిస్ట్రార్, డిప్యూటీ డైరెక్టర్ సహా పరిపాలన పదవులు నిర్వహిస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు, సివిల్ సర్వెంట్ ప్రవర్తనా నియమావళి ప్రకారం, ఒక సివిల్ సర్వెంట్‌పై క్రిమినల్ కేసు నమోదుచేస్తే, అతన్ని వెంటనే సర్వీసు నుంచి సస్పెండ్ చేస్తారు. ప్రస్తుతం, అవినీతి నిరోధక శాఖ 10 మంది వర్సిటీ అధికారులపై కేసు నమోదుచేసింది. ఈ కారణంగా, వారిని సస్పెండ్ చేయాలని వర్సిటీ యాజమాన్యం నిర్ణయించింది. వర్సిటీకి వీసీ పదవి ఖాళీగా ఉన్నందున, ఉన్నత విద్యా కార్యదర్శి, సాంకేతిక విద్య కమిషనర్‌తో కూడిన సమన్వయ కమిటీ విశ్వవిద్యాలయం పరిపాలన పర్యవేక్షిస్తోంది. ఈ కమిటీ ద్వారా 10 మంది అధికారులను సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం. 10 మందిలో ఒకరైన మాజీ రిజిస్ట్రార్ జె.ప్రకాష్‌ను తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ గవర్నర్ సిండికేట్ సభ్యుడిగా నియమించారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో, గవర్నర్ ఆయను ఆ పదవి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టే అవకాశముందని వర్సిటీ వర్గాల సమాచారం.

రోడ్లకు కులం పేరు మార్పుపై జీవో..

10 వరకు తాత్కాలిక నిషేధం పొడిగింపు

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్లకు సూచించిన కులాల పేర్లు మార్చాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌లో, తదుపరి చేపట్టనున్న చర్యలకు విధించిన తాత్కాలిక నిషేధాన్ని డిసెంబరు 10వ తేది వరకు హైకోర్టు మదురై బెంచ్ పొడిగించింది. అంటరానితనాన్ని అవమానించే పదం 'కాలనీ' ఉండడంతో, ప్రభుత్వ పత్రాల నుంచి తొలగించారు. అలాగే, రోడ్లు, వీధుల పేర్ల నుంచి కుల పేర్లను తొలగించాలని ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ జీవోకు వ్యతిరేకంగా హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారించిన హైకోర్టు, నివాస ప్రాంతాలు, వీధులు, రోడ్లు, గ్రామాల పేర్ల నుంచి కుల పేర్లను తొలగించాలని ప్రభుత్వ జీవోపై మధ్యంతర స్టే విధిస్తూనే, ప్రాథమిక శాస్త్రీయ క్షేత్ర అధ్యయనం చేయవచ్చని, ఈ వ్యవహారంపై తదుపరి చర్యలు చేపట్టరాదని ఆదేశించింది. ఈ పిటిషన్ మంగళవారం మళ్లీ విచారణకు రాగా, అఫిడవిట్ దాఖలుకు కొంత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. అనంతరం, న్యాయస్థానం ఇదివరకే జారీచేసిన మత్యంతర స్టేను డిసెంబరు 10వ తేది వరకు పొడిగించిన హైకోర్టు, తదుపరి విచారణ వాయిదావేసింది.

వివాహం జరిగి రెండున్నర నెలలే... కానీ 8 నెలల గర్భం!

● పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివాహమైన రెండున్నర నెలలకే భార్య 8 నెలల గర్భవతి అని తెలియడంతో, భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కడలూరు జిల్లా కురింజిపాడి సమీపంలోని గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతికి, నైలామూర్ గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడితో సెప్టెంబరు 4వ తేది వివాహమైంది. కొద్దిరోజుల క్రితం భార్య కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో, భర్త ఆమెను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. ఆమెను పరీక్షించిన వైద్యులు, ఆమె 8 నెలల గర్భవతి అని చెప్పడంతో భర్త దిగ్భ్రాంతి చెందాడు. తన భార్య గర్భానికి కారణమైన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలంటూ ఆ భర్త నైవేలి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణలో... యువతి గర్భానికి కారణం మేనమామ అని తెలిసింది. కాగా వ్యక్తి మూడు నెలల క్రితం నైవేలీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో కోమాలో ఉండడం గమనార్హం.

బిహార్ విజయానికి కారణం 'సర్'...!

● నితీశ్‌కుమార్ లాగే ఈపీఎస్ సీఎం అవుతారు
● మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్



మీడియా సమావేశంలో దిండుగల్ శ్రీనివాసన్, సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బిహార్ విజయానికి 'సర్' కారణమని, నితీశ్ కుమార్‌లాగే రాష్ట్రంలో ఎడప్పాడి పళనిస్వామి కూడా ముఖ్యమంత్రి అవుతారని అన్నాడీఎంకే మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ జోస్యం చెప్పారు. మదురైలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బిహార్ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో కూడా వస్తాయని, 2026 ఎన్నికల్లో 220 స్థానాల్లో అన్నాడీఎంకే విజయం సాధించి, ముఖ్యమంత్రిగా ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకానుందని తెలిపారు. 'సర్'ను వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. సర్ పనుల్లో డీఎంకే శ్రేణులు పాల్గొంటున్నారని, వారు కూడా ఓటర్ల జాబితాను పూర్తిగా పరిశీలించాలన్నారు సర్ పనుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, సర్‌కు విధులు బహిష్కరిస్తూ వారు సమ్మె చేపట్టడం న్యాయమైన చర్య అన్నారు. సర్ పనుల కారణంగా దిండుగల్ నియోజకవర్గంలో సుమారు 40 వేల నుంచి 50వేల వరకు ఓట్లు తగ్గుతాయని, అవన్నీ నకిలీ ఓట్లు అని వ్యాఖ్యానించారు. ఆయన వెంట మాజీ మంత్రులు సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్ తదితరులున్నారు.

మద్యం తరలింపు: ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం ప్యాకెట్లను వేలూరుకు తరలించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు జిల్లా పేర్నాంబట్టు నుండి వేలూరు నగరానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన బ్రాందీ ప్యాకెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి ఓ ఇంట్లో పెద్దమొత్తంలో మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించిన పోలీసులకు ఓ ఇంట్లో 1,152 బ్రాందీ ప్యాకెట్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని మహిళ సహా ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. విచారణలో వేలూరుకు చెందిన ప్రకాష్, అరుళ్ సెల్వి అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కలుషిత నీటిని తాగి ఆస్పత్రిపాలైన గ్రామస్తులు



ఆస్పత్రిలో చేరిన వృద్ధులు

తిరుత్తణి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో గత కొన్నిరోజులుగా కలుషితమైన నీరు తాగిన గ్రామస్తులు ఆస్పత్రి పాలవుతున్నారు. పళ్లిపట్టులోని సాలియార్‌వీధి, ఆంజనేయనగర్, ఇళ్లపతివీధి, గాంధీనగర్ తదితర వీధుల్లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో పైపులు పగిలి నీరు లీకవుతుందని, ఆ నీటిలో డ్రైనేజీ నీరు కూడా కలుస్తుందని ప్రజలు పంచాయతీ కార్యనిర్వాహక అధికారి రాజ్‌కుమార్‌కు తెలిపినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు కలుషిత నీటిని తాగి విరోచనాలతో ఒకరి తర్వాత ఒకరు 40 మంది అస్వస్థతకు గురవడంతో వారిని తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండల బీజేపీ నేతల పరామర్శ...

పళ్లిపట్టులో కలుషిత నీటిని తాగిన కారణంగా ఆస్పత్రి పాలైనవారిని మంగళవారం సాయంత్రం పళ్లిపట్టు మండల బీజేపీ అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులందకి ఆయన పండ్లు, పాలు తదితర సహాయాలను అందజేసి, నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

విద్యార్థులకు తప్పిన ముప్పు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్పాడిలో పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుతున్న ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. అయితే, గుండెలో నొప్పి రావడాన్ని గమనించిన డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కన ఆపడంతో విద్యార్థులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మృతుడిని వ్యాసార్పాడికి చెందిన మురుగన్ (40)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీవీకే సభ్యులకు

క్యూ ఆర్ కోడ్‌తో గుర్తింపు కార్డు

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) సభ్యులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ విషయమై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తన ఎక్స్ పేజీలో... రాష్ట్ర రాజకీయ పార్టీ చరిత్రలో తొలిసారిగా తమ పార్టీ నాయకులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన గుర్తింపు కార్డులు అందజేశామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలువిడతగా సుమారు 3 లక్షల మంది నిర్వాహకులను ఎంపిక చేశామన్నారు. వారిలో తొలివిడతగా ప్రస్తుతం 106 జిల్లాలకు చెందిన 214 శాసన సభ నియోజకవర్గాల పరిధిలో 1,02,103 మందికి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన గుర్తింపు కార్డులను పార్టీ అధ్యక్షుడు విజయ్ సూచన మేరకు ఆయా జిల్లాల కార్యదర్శులకు అప్పగించినట్లు బుస్సీ ఆనంద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక అయ్యప్ప భక్తుడి మృతి

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తుడు మృతిచెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తులు సోమవారం కారులో శబరిమల బయల్దేరారు. దిండుగల్ జిల్లా నీలకోట మార్గంలో వస్తున్న ఆ కారును ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మీకాంత్ (36) ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు గాయపడ్డారు. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'సర్' పనుల వేగవంతం



సర్వేలో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులను వేగవంతం చేసినట్లు వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సర్ పనులను పరిశీలించిన ఆమె అధికారులకు త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, అసిస్టెంట్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఫొటో ఎగ్జిబిషన్



వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కేవీ.కుప్పం పంచాయతీ పరిధిలోని దేవర్షికుప్పంలో మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ పథకాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.. ఈ ఎగ్జిబిషన్‌లో నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగే ఫొటోలు ప్రదర్శించారు. పంచాయతీ అధికారి ప్రేమావతి రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.36కోట్లతో చెరువు శుద్ధీకరణ

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని కలింజూరులోని ధారాపడవేడు చెరువు శుద్ధీకరణ పనులకు రాష్ట్రప్రభుత్వం రూ.36కోట్లు కేటాయించిందని ఎంపీ జగత్రక్షగన్ పేర్కొన్నారు. చెరువుల శుద్ధీకరణ పథకంలో భాగంగా సోమవారం సాయంత్రం ధారాపడవేడు చెరువును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరితగతిన పనులను ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

'సర్'ను సమర్థవంతంగా నిర్వహిస్తాం



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం పాతబస్టాండు సమీపంలో ఉన్న మున్సిపల్ కార్యాలయంలోని మహిళా స్వయం సహాయక బృందం ఆధ్వర్యంలో సర్ పనులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఆర్గనైజర్ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్ నిర్వహించే అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆడిటింగ్ సిబ్బందికి వృత్తి నైపుణ్య శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఆడిటింగ్ ఉద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు మంగళవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పించన్ తదితర లావాదేవీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు నియమితులైన నూతన ఉద్యోగుల కోసం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని, అకౌంటింగ్ తదితర విభాగాలపై వీరికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అకౌంట్స్ విభాగ అధికారి పిల్లి విజయ, ట్రెజరీ మండల జాయింట్ డైరెక్టర్ ఉషా, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా రిపబ్లిక్ పార్టీ సభ్యుల సమావేశం



సమావేశంలో పార్టీ నేతలు

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని గ్రీన్ సర్కిల్ సమీపంలోని విష్ణు గ్రానైట్ ప్రాంగణంలో ఇండియా కుడియరసు పార్టీ (ఐకేపీ) జిల్లా నేతల ప్రత్యేక సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తమిళరసన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణానికి కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గౌరీశంకరన్, వేలూరు జిల్లా అధ్యక్షుడు దిలీప్‌కుమార్, కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

'చెన్నై వన్' యాప్‌లో రూ.1,000 బస్ పాస్

పెరంబూర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోరైలు, సబర్బన్ రైలు, ఎంటీసీ బస్సుల్లో ఒకే టిక్కెట్టు మీద ప్రయాణించేలా 'చెన్నై వన్' యాప్ పరిచయం చేశారు. ఈ యాప్‌కు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థుల, ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో, ఈ యాప్‌లో రోజువారీ టిక్కెట్లు మాత్రమే అందిస్తుండగా, మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అందిస్తున్న రూ.1,000, రూ.2,000 బస్ పాస్‌లు ఉపయోగించుకునే సదుపాయాన్ని కల్పించినట్లు అధికారులు తెలిపారు.

రహదారి కోసం స్థలాన్ని దానం చేసిన హైకోర్టు జడ్జి

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా రహదారి నిర్మించేందుకు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు 20 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చారు. జిల్లా కేంద్రమైన విరుదునగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పుగళేంది ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను జన్మించిన జిల్లాలో జరిగిన పుస్తక ప్రదర్శన ముగింపు వేడుకలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేసమయంలో తాను పుట్టిన జిల్లాకు ఏమి చేయలేదన్న అసంతృప్తి ఉందన్నారు. అందుకే తనస్వగ్రామమైన మేల్ అంబత్తూరులో రహదారి నిర్మాణం కోసం తనకు చెందిన 20 సెంట్ల స్థలాన్ని దానంగా ఇస్తూ జిల్లా యంత్రాంగానికి ఒక లేఖ కూడా రాసిచ్చానని వెల్లడించారు. దీంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా న్యాయమూర్తి పెద్ద మనసును అభినందించారు.

గంజాయి రవాణా : ఇద్దరి అరెస్టు



తిరువళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమంగా తరలించి విక్రయించడానికి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా... తిరువళ్లూరు జిల్లా ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయి, మత్తు మాత్రల అమ్మకాలు పెరిగాయనే సమాచారంతో కమిషనర్ శంకర్ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పూందమల్లిలో ఎస్ఐ నాగమ్మాల్ నేతృత్వంలోని పోలీసుల బృందం సోమవారం సాయంత్రం వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో పూందమల్లి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని వారిని తనిఖీ చేయగా బ్యాగులో 23 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకులు నామక్కల్ జిల్లాకు చెందిన సురేష్, దీనదయాళన్‌గా గుర్తించారు. వీరు బెంగళూరు నుంచి బస్సులో గంజాయిని తీసుకొచ్చి విద్యార్థులకు అమ్ముతున్నట్లు విచారణలో తెలిసింది. విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది.

ఎస్ఐపై దాడి కేసులో ఇద్దరి అరెస్టు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురసైవాక్కంలో రాత్రిపూట విధులు నిర్వహిస్తున్న ఎస్ఐపై దాడి చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... పురసైవాక్కం, గంగాదీశ్వరన్ ఆలయ ప్రాంతానికి చెందిన శ్రీధర్ (58) ఒట్టేరి స్ట్రాన్స్ సాలైలో మద్యం మత్తులో ఓ వ్యక్తితో గొడవపడుతున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఎస్ఐ శ్రీధర్‌ను వారిని అక్కడ నుంచి పంపించివేశారు. అయితే వెనుక నుంచి వచ్చిన వ్యక్తి ఎస్ఐ చొక్కాపట్టుకుని చేయి చేసుకున్నాడు. దీనిపై ఒట్టేరి పోలీసులు కేసు నమోదు చేసి, ఒట్టేరి ఎస్వీఎం నగర్‌కు చెందిన సంజయ్, కైలాష్ లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

మత్తు మాత్రలు విక్రయించిన నలుగురి అరెస్టు


అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి ప్రాంతంలో మత్తుమాత్రలతో పాటు గంజాయిని విక్రయించిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 20 మత్తు మాత్రలతో పాటు 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తరమణి పోలీసులు సోమవారం రాత్రి 200 అడుగుల సాలైలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగుల్లోని 20 మత్తు మాత్రలు, 20 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన లోకేష్, విక్కి, లోగనాథన్, నిత్యానందంని అరెస్టు చేశారు.

సంగమేశ్వరాలయంలో ప్రదోషకాల పూజలు

తిరుత్తణి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. మూలవర్లు, నంది విగ్రహాలకు అభిషేకాలను అలయ అర్చకులు నిర్వహించారు. పురవీధుల్లో స్వామివార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. డిసెంబరు 4వ తేదీ జరగనున్న కార్తిక దీపోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయానికి రంగులు వేయించారు.

‘గొప్పవారి జీవితాలు గుర్తు చేస్తాయి మనమూ మన జీవితాలను మెరుగుపరచుకోవచ్చని’ అని ఒక కవి అన్నట్లు గొప్పవారి జీవితాలను ప్రేరణగా తీసికొని పురుషులు తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలనే లక్ష్యాన్ని ప్రాతిపదికగా మలచుకుని ‘ప్రపంచ పురుషుల దినోత్సవం’ రూపకల్పన చేయబడింది. ‘అంతర్జాతీయ మహిళా దినోత్సవం’ ఉన్నట్లే అంతర్జాతీయ పురుషుల దినోత్సవం కూడా ఉండడం లింగసమానతకు అద్భుతమైన నిదర్శనం కదా! ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా దాని లక్ష్యాలు, పురుషుల సమస్యలు, ఆరోగ్యం, బాలుర, యువత అభివృద్ధి మొదలైన ఎన్నో అంశాల సమాహార ప్రత్యేక కథనం మీకోసం.....

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



స్ఫూర్తి ప్రదాతలు...

పలు రంగాల్లో ప్రసిద్ధులు

• అందరికీ ఆదర్శ పురుషులు



థీమ్...

ఒక్కో సంవత్సరం ఒక్కొక్క థీమ్ (ఇతివృత్తం)తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ‘పురుషుల ఆరోగ్యం’ ఆదర్శస్ఫూర్తిదాయక పురుషులు, ‘మన సంతానభవిషత్తు, స్వస్థత, క్షమాగుణం, పురుషులను, బాలురను సురక్షితంగా ఉంచడం’ వంటి థీమ్‌ల నేపథ్యంగా పురుషుల దినోత్సవాలు జరిగాయి. 2023వ సంవత్సరంలో ‘పురుషుల ఆత్మహత్యలను పూర్తిగా నివారించడం’ అనే థీమ్‌తో నిర్వహించబడింది. 2024వ సంవత్సరం ‘స్ఫూర్తిప్రదాతలైన ఆదర్శ పురుషులు’ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. 2025వ సంవత్సరం ‘పురుషుల దినోత్సవం’ థీమ్ ‘పురుషులకు, బాలురకు వెన్నుదన్నుగా ఉండటం’. అంటే బాలుర, పురుషుల శారీరక, మానసిక, సామాజిక సంక్షేమానికి అందరూ సహకరించాలని అర్థం.

పురుషుల దినోత్సవం- దిశా నిర్దేశం....

‘ఫ్రాన్స్’కి చెందిన ఓ ప్రొఫెసర్ థామస్ ఓస్టర్ 1991వ సంవత్సరం ఫిబ్రవరి 7వ తేదీ ప్రపంచ పురుషుల దినోత్సవానికి శ్రీకారం చుట్టారు. సమాజానికి పురుషులు చేసే సేవల్ని గుర్తిస్తూ కృతజ్ఞత తెలపాలనే ఉద్దేశంతో ఆయన దీనిని ప్రారంభించారు. దీనికి బాగా ఊతమిచ్చినవారు ట్రినిడాడ్ టొబాగో దేశస్థులు. ఆస్ట్రేలియా, జమైకా, ఇండియా, చైనా, కొలంబియా, సింగపూర్, యూఎస్, యూకే తదితర 80 దేశాలకు పైగా ఈ దినోత్సవాన్ని జరుపుతున్నాయి. ప్రతి సంవత్సరం నవంబర్ 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పురుషుల దినోత్సవం అత్యంత ఉత్సాహంగా జరుగుతోంది.

ప్రతి రంగంలోనూ భగీరథుల వంటి ఉద్దండులు జన్మించి సామాన్యస్థాయి నుండి ఉన్నతస్థాయికి ఎదగి జాతి కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తారు. కన్నవారిని కావడిగంపలో కూర్చోబెట్టి భుజాన మోస్తూ తీర్థయాత్రలు చేసిన శ్రవణకుమారుడు, తండ్రి మాటకై రాజ్యాన్ని వదిలి కానలకేగిన శ్రీరామచంద్రుడు, ఇచ్చిన మాటకు కట్టుబడి ఆజన్మాంతం బ్రహ్మచారిగా నిలిచిన భీష్మ పితామహుడు వంటి ఎంతోమంది ఆదర్శ పురుషులు, స్ఫూర్తిప్రదాతలు మన పురాణాల్లో దర్శనమిస్తారు. చరిత్రకెక్కిన రాజులు, చరిత్ర సృష్టించిన మహాపురుషులు ఎందరో.... మరెందరో ఉన్నారు. ఆధునికయుగంలో ప్రపంచాన వివిధ రంగాల్లో విజయ పరపరల అధ్యాయాలను రచిస్తూ, అభ్యుదయ పథంలో దూసుకుపోతున్నారు. పురుష పుంగవులు విశ్వరహస్యాలను ఛేదించే శాస్త్రజ్ఞులు, అంతరిక్షంలో గ్రహాల ఆచూకీ కనుగొంటున్న పరిశోధకులు, శాస్త్రీయ, వైజ్ఞానిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన శాస్త్రజ్ఞులు, లలిత కళలకు జీవితాలనే అంకితం చేసిన కళాకారులు, విద్యారంగంలో ప్రముఖులైన విద్యావేత్తలు ఎందరో స్ఫూర్తి ప్రదాతలుగా పురుషులకు ఆదర్శంగా మార్గనిర్దేశం గావిస్తున్నారు. భారతదేశంలో 2007వ సంవత్సరం నుంచి ప్రపంచ పురుషుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని అసువులు బాసిన అమరవీరులు, దేశభక్తులు, బాల్యవివాహాలను, సతీ సహగమనాన్ని అరికట్టిన సంఘసంస్కర్తలు, స్త్రీల విద్య కోసం పాటుపడిన విద్యావేత్తలు, వైద్య, వైజ్ఞానిక మొదలైన రంగాల్లో ప్రసిద్ధులైనవారు.... ఇలా ఎందరో నేటికీ మన పురుష లోకానికి దారిదీపం చూపిస్తూ ఆదర్శంగా నిలిచారు.

పురుషుల దినోత్సవం.. ఆవశ్యకత...

‘మహిళా దినోత్సవం’ జరుపుతున్నట్లే పురుషుల దినోత్సవం కూడా జరపాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందా? అంటే ఉందనే చెప్పాలి. పురుషులు కూడా స్త్రీల మాదిరిగానే కుటుంబంలో, సంఘంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారికీ కోపతాపాలు, భావోద్వేగాలు సహజమే కదా! ఇంట్లో అశాంతి నెలకొన్నప్పుడు కారణం ఎవరైనా, నింద పురుషుడిపై పడుతుంది. ఎందరో మగవారు గృహహింసను ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రపంచంలో ఎన్నో ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురై ఎంతో మంది పురుషులు ఆత్మన్యూనతకు లోనవుతున్నారు. ఒత్తిడి వారి శారీరక, మానసిక ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్నది. కొన్ని చట్టాల్లోని లొసుగులు కూడా పురుషుల మనుగడను దుర్భరం చేస్తున్నాయి. ఉద్యోగాల్లో టార్గెట్లను అందుకోలేక, ఇంట్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనలేక ఎంతోమంది పురుషులు తమ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారు. వీరందరిలో ఆశావహ దృక్పథం కలిగించేటందుకు, స్ఫూర్తి పెంపొందించేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అవగాహన కల్పించేందుకు పురుషుల దినోత్సవాలు జరపడం అవసరమే కదా!



పురుషుల దినోత్సవాన్ని ఎలా జరుపుకుంటారు?

బాలురు, యువత కూడా నేటికాలంలో సుస్థిర జీవనానికి దూరం అవుతున్నారు. తమకు ఆసక్తిలేని చదువులను తల్లిదండ్రుల బలవంతం మీద చదవడం, నచ్చని రంగంలో ప్రవేశించడం వారిని నిరాశ నిస్పృహలకు గురిచేస్తున్నది. ఎంతోమంది పిల్లలు చదువు ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రుల మధ్య సయోధ్యలేకపోవడం కూడా వారిని మానసికంగా క్రుంగదీసి చదువు పట్ల అనాసక్తిని రేకెత్తిస్తున్నది. ఆత్మన్యూనతను కలిగిస్తున్నది. చదువుల్లో, ఉద్యోగాల్లో పోటీతత్వాన్ని ఎదుర్కొలేక యువత అశక్తతతో ఉసురు తీసుకుంటున్నది. దీంతో బాలురు, యువత చిన్న వయసులోనే అనేక వ్యసనాల పాలవుతున్నారు. పిల్లలను, పెద్దలను వ్యసనాల పాలు కానివ్వకుండా, ఉన్నతమైన వ్యక్తులుగా రూపొందించేటందుకు, వారిలో సత్ప్రవర్తన పట్ల అవగాహన కలగజేసేందుకు పురుష దినోత్సవాల ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఆయా సంవత్సరాల పురుషుల దినోత్సవం థీమ్‌ని అనుసరించి బాలురు, యువత, మగవారు అందరిలో చైతన్యం కలిగిస్తారు. సభలు, సమావేశాలు నిర్వహిస్తారు. ర్యాలీలు చేస్తారు. అబ్బాయిలు, పురుషులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను సమష్టిగా ఎలా పరిష్కరించ వచ్చనే దానిపై చర్చలు, సంభాషణలు జరుపుతారు. పురుషులను సానుకూల రోల్ మోడల్స్‌గా ప్రోత్సహించేటందుకు వారి ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం మొదలైన అంశాలపై సమాజానికి అవగాహన కల్పిస్తారు. అంతర్జాతీయ పురుష దినోత్సవం సందర్భంగా కొందరైనా పురుషులు వారి సమస్యలను అధిగమించ గలిగితే, సానుకూల దృక్పథం అలవరుచుకోగలిగితే, శీల సంపత్తిని పెంపొందించుకోగలిగితే పురుషుల దినోత్సవానికి సార్థకత లభించినట్లే!



మీడియా సమావేశంలో చిత్ర బృందం

24 ఏళ్ల తర్వాత ‘ఫ్రెండ్స్’ రీ రిలీజ్

సాదిక్ దర్శకత్వంలో విజయ్, సూర్య, దేవయాని, విజయలక్ష్మి, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన ‘ఫ్రెండ్స్’ చిత్రాన్ని 24 యేళ్ల తర్వాత 4కే డిజిటల్ వెర్షన్‌లో ఈ నెల 21న రీ-రిలీజ్ చేస్తున్నారు. దీనిని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో ఆడియో, ట్రైలర్ విడుదల చేయడంతో పాటు రీ రిలీజ్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ దర్శకుడు పేరరసు హాజరై ట్రైలర్ రిలీజ్ చేశారు. అయితే, మూవీలో నటించిన ప్రధాన తారాగణం విజయ్, సూర్య, దేవయాని, వడివేలు, విజయలక్ష్మి ఈ వేడుకకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో నటించిన వారిలో రమేష్ ఖన్నా మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘ఈ సినిమా షూటింగ్ సమయంలోనే ‘తెనాలి’ చిత్రంలో నటించాను. దర్శకుడు సాధిక్ ధైర్యశాలి, మంచి ప్రతిభావంతుడు. ఆయన రాసిన డైలాగుల్లో ఒక్కదాన్ని కూడా మార్చేందుకు అంగీకరించేవారుకాదు. ఆయనకు సహాయకుడుగా గోకులకృష్ణ ఉన్నారు. ప్రతి డైలాగును తమిళంలో ఎంతో అందంగా రాశారన్నారు. అలాగే, ఈ సినిమా రీ రిలీజ్ పై వడివేలు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో వడివేలు నటించిన నేశమణి పాత్ర కొన్నేళ్ళపాటు ప్రేక్షకుల మనస్సుల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయింది. కాగా, ఈ నెల 21వ తేదీన జాక్కువార్ స్టూడియోస్ పతాకంపై నిర్మాత బి.వినోద్ కుమార్ జైన్ ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నారు.

చిత్రజ్యోతి

గ్యాంగ్‌స్టర్ మూవీ ‘ఫ్రైడే’

అనీష్ మాసిలామణి దర్శకత్వంలో దీనా, మైమ్ గోపి, అనీష్ మాసిలామణి ప్రధాన పాత్రలు పోషించిన ‘ఫ్రైడే’ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కగా ఈ నెల 28వ తేదీ విడుదలకు సిద్ధమైంది. దక్షం మోషన్ పిక్చర్స్ పతాకంపై అనీష్ మాసిలామణి నిర్మించారు. గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్ మూవీగా రూపొందిన ఈ చిత్రం నాన్ లీనియర్ శైలిలో ఒకే రోజు రాత్రి జరిగే ఆసక్తికరమైన సంఘటనలతో తెరకెక్కించారు. సింహ భాగం షూటింగ్ కులచ్చల్ ఓడరేవు, దాని పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ మూవీ ద్వారా దక్షం మోషన్ పిక్చర్స్ తొలిసారి చిత్ర నిర్మాణంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే నిర్మాణ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీని శివానీ స్టూడియోస్ రిలీజ్ చేయనుంది.



‘ఫ్రైడే’లో ఓ దృశ్యం

యధార్థ సంఘటనలతో ‘ఏ బ్యూటిఫుల్ బ్రేకప్’

ఇంగ్లండ్‌లో జరిగిన యధార్థ సంఘటనలతో తెరకెక్కించిన ‘ఏ బ్యూటిఫుల్ బ్రేకప్’ మూవీని వచ్చే యేడాది ప్రేమికుల దినోత్సవం రోజున రిలీజ్ చేయనున్నారు. యూకేకు చెందిన 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ నిర్మించిన ఈ సినిమాకు దర్శకత్వం అజిత్ వాసన్ ఉక్కినా. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఈ మూవీకి తన సింఫొనీ సంగీతాన్ని అందించారు. తక్, మాటిల్డా పాజర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ మూవీ టీజర్ విడుదలకాగా, మంచి స్పందన వచ్చింది. ఈ టీజర్‌ను 1.7 మిలియన్ల మంది నెటిజన్లు వీక్షించారు. విభిన్న సంస్కృతులకు చెందిన ప్రేక్షకులను భావోద్వేగపరంగా కనెక్ట్ చేసేలా ఈ స్క్రిప్టు ఉంటుందని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ వెల్లడించింది.



‘ఏ బ్యూటిఫుల్ బ్రేకప్’లో ఓ దృశ్యం

ఎస్.శివసూరియర్ శతాబ్ది వేడుకలు ప్రారంభం

తమిళ సినిమా దిగ్గజ నటుడు, ద్రావిడ తత్త్వవేత్త, కలైమామణి ఎస్ఎస్.శివసూరియన్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకలు సోమవారం నగరంలో ప్రారంభమయ్యాయి. టి.నగర్‌లోని వాణి మహల్‌లో జరిగిన ఈ వేడుకల్లో డీఎంకే కార్యనిర్వహణ కార్యదర్శి, మాజీ ఎంపీ ఆర్ఎస్ భారతి, ఎస్.శివసూరియన్ కుమారుడు, తమిళనాడు హౌసింగ్ బోర్డు చైర్మన్, డీఎంకే ప్రధాన కార్యాలయ కార్యదర్శి, నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పూచ్చి మురుగన్ మాట్లాడుతూ, ‘సమాజంలో నానాటికీ అంతరించిపోతున్న గ్రామీణ కళలను, నాటకాలను పునరుద్ధరించానికి ఎస్.శివసూరియన్ కలైకూడం తమ వంతు కృషి చేస్తుందన్నారు. ఈ కలైకూడం తరపున ఐదుగురు వృద్ధ కళాకారులకు ఆర్థిక సాయం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ చెన్నై ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, హీరోలు కార్తి, విశాల్, నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు కరుణాస్, సీనియర్ నటి సచ్చు లత, నటులు ఎస్ఎస్ రాజేంద్ర కుమార్, ఆనంద్ బాబు, పొన్‌వణ్ణన్, బోస్ వెంకట్, శ్రీమాన్, పెప్సీ విజయన్, లలిత కుమారి, కుట్టి పద్మిని తదితరులు పాల్గొన్నారు.



వృద్ధ కళాకారిణికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

‘డ్రోన్ జామర్’ కొనుగోలు చేయనున్న ఇంటెలిజెన్స్ శాఖ



డ్రోన్ జామర్ పరికరం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధ కార్యక్రమాల్లో వినియోగించే ‘డ్రోన్’లను అడ్డుకునేలా రాష్ట్ర ఇంటిలిజెన్స్ విభాగం ‘డ్రోన్ జామర్’ పరికరం కొనుగోలు చేయనుంది. అభిరామపురంలోని మరుతం కాంప్లెక్స్‌లో ఎస్సీసీఐడీ అనే ఇంటెలిజెన్స్ బ్యూరో భద్రతా విభాగ డీజీ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం తరపున, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగించే ‘డ్రోన్’ నిలిపివేసేలా జామర్ పరికరం కొనుగోలు చేయనున్నారు. అందుకు టెండర్లు విడుదల చేశారు. టెండరు పొందిన సంస్థ 60 రోజుల్లోగా డ్రోన్ జామర్ అందించాలి, జామర్ 6 కిలోల బరువు మించి ఉండరాదు, ఎలాంటి ప్రాంతాలకైనా సులభంగా తీసుకెళ్లేలా ఉండాలి, కి.మీ దూరంలోని డ్రోన్‌లను నిలిపివేయగలిగే సామర్థ్యం ఉండాలి తదితర నిబంధనలు టెండర్‌లో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు.

తిరువళ్లూరు కలెక్టర్‌కు కేంద్ర అవార్డు



కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని పాలపురం పంచాయతీ నీటి నిర్వహణలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఇందుకుగాను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ప్రతాప్ మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా తాగునీరు, సాగునీటికి ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా పలు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పాలపురం పంచాయతీలో గతంలో ప్రజలు తాగునీరు కలుషితమై రోగాల బారిన పడ్డారన్నారు. దీంతో తాను తిరువళ్లూరు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందుబాటులో తెచ్చామన్నారు. దీనికిగాను తాను ఈ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరక్టర్ వి. జయకుమార్ పాల్గొన్నారు.

పక్షవాతానికి గురైన యువకుడికి సిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదడులోరక్తం గడ్డకట్టడంతో పక్షవాతానికి గురైన 29 యేళ్ల యువకుడికి వడపళనిలోని సిమ్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి వైద్యనిపుణులు అతడిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. గుండె నాళాన్ని చక్కదిద్ది, కాలిలో ఏర్పడిన అపసవ్యతను సరిచేసి ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యనిపుణులు డాక్టర్ ప్రభాష్ ప్రభాకరన్, డాక్టర్ వివేక్ అయ్యర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ రితేష్, ఆర్, నాయర్, డాక్టర్ ఎస్ సెల్విన్, డాక్టర్ సాయిరామ్ సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.



కోలుకున్న యువకుడితో సిమ్స్ వైద్యనిపుణులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

కార్తిక దీపోత్సవంలో భద్రత కట్టుదిట్టం

• అధికారులకు మంత్రి శేఖర్‌బాబు ఆదేశం

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయంలో డిసెంబరు 3వ తేదీ (మంగళవారం) జరిగే కార్తిక దీపోత్సవ వేడుకలపై మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబరు 3వ తేదీ తెల్లవారుజాము 5 గంటలకు భరణిదీపం, సాయంత్రం కొండ శిఖరంపై మహాదీపం వెలిగిస్తారని, ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా పలు రాష్ట్రాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థలు సుమారు 4,764 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మహాదీపం అనంతరం నిర్వహించే గిరిప్రదక్షిణలో కూడా భక్తులకు తాగునీరు, వైద్య శిబిరాలు తదితర వసతులు కల్పించాలని ఆయన ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీడబ్ల్యూడీ శాఖ మంత్రి ఏవీ వేలు జిల్లా కలెక్టర్ దర్పగరాజ్, ఎస్పీ సుధాకర్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికార నందికి చందనాభిషేకం

తిరువణ్ణామలై ఆలయంలోని ప్రధాన రాజగోపురం ముందుండే అధికార నంది (భారీ నంది)కి ప్రతి నెలా ప్రదోష వేళల్లో చందనాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నంది విగ్రహానికి చందనాభిషేకాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో సుమారు గంటసేపు క్యూలైన్లలో వేచివున్నారు.



నంది విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



లావణ్యను అభినందిస్తున్న కరునాగరాజన్, గురువు డాక్టర్ శ్వేత, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

అలరించిన లావణ్య అరంగేట్రం

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై అనకాపుత్తూరుకు చెందిన లావణ్య భరతనాట్య అరంగేట్రం మైలాపూరు ఆర్కే స్వామి హాలులో అత్యంత వైభవంగా కొనసాగింది. అనకాపుత్తూరు ముద్రాలయ అకాడమీ శిక్షణా సంస్థలో శిక్షణ పొందిన లావణ్య నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. లావణ్య తల్లిదండ్రులు మారిముత్తు, విశాలం అనకాపుత్తూరులో ఇస్త్రీ దుకాణం నడుపుతున్నారు. నాట్యంపై ఆసక్తిపెంచుకున్న లావణ్యకు భరతనాట్యం నేర్పించేందుకు అన్ని విధాలా సహకరించారు. అంతే కాకుండా ఆమెను బీఎస్సీ వరకు చదివించారు. దంతవైద్య నిపుణులు డాక్టర్ ఎం. శ్వేతా నడుపుతున్న ముద్రాలయ అకాడమీలో చేరి లావణ్య భరతనాట్యం నేర్చుకుంది. ఈ నేపథ్యంలో మైలాపూరు ఆర్కేస్వామి హాలులో లావణ్య భరతనాట్య అరంగేట్రం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు కరునాగరాజన్, డాక్టర్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై లావణ్యను అభినందించారు. లావణ్య గురువు డాక్టర్ శ్వేతా, ఫెడరల్ బ్యాంక్ మాజీ మేనేజర్ మునుసామి, ఆమె కుటుంబీకులు, స్నేహితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చెన్నై గిండిలోని గాంధీ మండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు వా.వు. చిదంబరం 89వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దామో అన్బరసన్, మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యే ఏవీఎం ప్రభాకర్ రాజా తదితరులు

స్వాతంత్ర్య సమరయోధుడు వీవోసీ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చెన్నై హార్బర్ మెయిన్ గేటు వద్ద వున్న ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెన్నై పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, చెన్నై పోర్ట్ అథారిటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.మురళీకృష్ణ, సంస్థ విభాగాధిపతులు, అధికారులు

